క్లుప్తంగా

నేటి నుంచి ఉపాధిహామీ గ్రామసభలు

సర్సాపూర్(జి): 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనుల గుర్తింపునకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఈజీఎస్ ఏపీఓ సుగుణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక, పనుల గుర్తింపు, లేబర్ బడ్జెట్ ఆమోదం కోసం గ్రామసభ తీర్మానాలను ఆయా గ్రామాల్లో 15 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రైతుబంధు వివరాల సేకరణ



పీచరలో వివరాలు సేకరిస్తున్న ఏఈవో

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, వడ్యాల్, లక్ష్మణచాంద, చామన్‌పెల్లి తదితర గ్రామాల్లో గురువారం కనకాపూర్, లక్ష్మణచాంద, పీచర క్లస్టర్ల ఏఈవోలు సంతోష్, ఉమామహేశ్వరి, పవిత్ర అర్హులైన వారి నుంచి రైతు బంధు వివరాలు సేకరించారు. ఈసందర్భంగా నూతన రైతుల పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్‌ల వివరాలను నమోదు చేసుకున్నారు.

విరాళం అందజేత

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటుకు గురువారం ఖానాపూర్ పట్టణానికి చెందిన చింతపండు గోపి రూ.11 వేలను విరాళంగా అందించారు. నగదు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు గోపి కుటుంబసభ్యులు అందించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో నారాయణరావు

ముధోల్: మండలంలోని రాంటెక్ గ్రామ ఎంపీటీసీ(బీఆర్ఎస్) ఆత్మస్వరూప్ 50 మంది కార్యకర్తలతో కలిసి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. భైంసాలోని తన నివాసంలో వారికి కాంగ్రెస్ నాయకులు భోస్లే నారాయణరావు పాటిల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మచ్కల్ ఉపసర్పంచ్ కరీం తదితరులున్నారు.

'లోక్‌సభలో దాడిపై విచారణ జరపాలి'

ఖానాపూర్: దేశ రాజధాని ఢిల్లీలోని లోక్‌సభలో బుధవారం జరిగిన దాడిపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లాధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. పట్టణంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభలోనే భద్రత లోపించిందంటే కేంద్రప్రభుత్వం సాధారణ ప్రజానీకాన్ని ఎలా కాపాడుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

కొనసాగుతున్న సప్తాహం

భైంసారూరల్: మండలంలోని మహాగాంలో ఉన్న విఠలేశ్వరస్వామి ఆలయంలో సప్తాహం గురువారం రెండోరోజుకు చేరింది. ఈనెల20 వరకు ఆలయంలో రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హారతి, జ్ఞానేశ్వరి పారాయణం, గాతభజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశమైన మహిళలు

కుంటాల: పొదుపు చేసి మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెంచికల్ పాడ్ గ్రామంలో నిర్వహించిన వీవో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకు రుణాలు, లావాదేవీలు, బీమా, సామాజిక భద్రత తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సీసీ పెంటన్న, వీవోఏ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బాబా భక్తుల పూజలు



హారతిలో పాల్గొన్న మహిళలు

కుంటాల: రెండో షిర్డీగా వెలుగొందుతున్న మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆయా మండలాల నుంచి మహిళలు తరలివచ్చి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిద్దరోతున్న సీసీ కెమెరాలు

- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- వినియోగంలోకి తేవాలని ప్రజల వేడుకోలు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మండల కేంద్రంలోని గోల్డ్‌వర్క్ షాప్. ఈనెల 2న ఈషాపులో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.లక్ష విలువైన బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. పోలీసులు వచ్చి ఘటనాస్థలం పరిశీలించారు.. ఆ మార్గంలో కానీ, షాపు వద్ద గాని సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు పట్టుబడలేదు.



ఎస్‌బీఐ ఎదుట కన్పించని సీసీ కెమెరా



మార్కెట్ వెళ్లే దారిలో నిరుపయోగంగా కెమెరా

కడెం: శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు, అపరిచితుల వివరాలు తెలుసుకునేందుకు మండలంలో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. నిఘా నేత్రాల ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ.. వాటి నిర్వహణపై లేకపోవడంతో పని చేయడం లేదు. దీంతో ఈవ్‌టీజింగ్ చేసిన వారితోపాటు దొంగతనాలు, ప్రమాదాలకు కారణమైన వారిని పట్టుకునేందుకు పోలీసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కడెంలో పని చేయని సీసీ కెమెరాలు

కడెం మండలంలో మొత్తం 28 గ్రామపంచాయతీలుండగా కడెం, అంబారిపేట్, లింగాపూర్ గ్రామాల్లోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లింగాపూర్‌లో కొన్ని చోట్ల మినహా ఎక్కడా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దాతలు, వ్యాపారుల సాయంతో మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు పని చేయడం లేదు. 2018లో అప్పటి ఎస్సై సయ్యద్ ముజాహిద్ ప్రత్యేక చొరవతో ఇందిరాగాంధీ కూడలి, అంబేద్కర్ కూడలి, తెలంగాణతల్లి, ఎస్‌బీఐ కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాలను వీక్షించేలా పోలీస్‌స్టేషన్‌లో మానిటర్ ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో కెమెరాలు నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రంలో చాలా చోట్ల సీసీ కెమెరాలు ఆనవాళ్లను కోల్పోయాయి. కేవలం ఆప్టికల్ ఫైబర్ వైరు మాత్రమే ఉంది. రెండేళ్ల కిందట స్థానిక వ్యాపారులు కొంత సొమ్ము జమ చేసినా.. సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించలేదు.

మరమ్మతులు చేయించాలి..

నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. అలాగే వివిధ ప్రాంతాల ప్రజలు కడెం ప్రాజెక్ట్‌ను సందర్శిస్తుంటారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో వీరందరికీ భద్రతపై భరోసా కల్పించవచ్చు. ఏవైనా ఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి పట్టుకోవచ్చు. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

బాగు చేయించాలి



గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై పర్యవేక్షణ లేక చాలా చోట్ల పనిచేయడం లేదు. పంచాయతీ పాలకవర్గం స్పందించి సీసీ కెమెరాలను బాగు చేయించాలి.

– మనోజ్, లింగాపూర్

వినియోగంలోకి తీసుకొస్తాం



మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామల్లోని వ్యాపారులు దుకాణాల ఎదుట సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. నేరాలు జరిగినపుడు వీటి సాయంతో సులభంగా నిందితులను పట్టుకోవచ్చు. మండల కేంద్రంలో పని చేయని సీసీ కెమెరాలకు త్వరలోనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

– కొసన రాజు, ఎస్సై, కడెం

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కుంటాల: కల్లూర్‌లో మొక్కజొన్నను పరిశీలిస్తున్న విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

నిర్మల్‌రూరల్: మొక్కజొన్నలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం జొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు నగేశ్‌కుమార్, వాణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని న్యూపోచంపాడు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను గురువారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, అధికారులు వినయ్‌బాబు, వసంతరావు, ఏఈఓ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలను వ్యవసాయ విశ్వవిద్యాలయం కేంద్ర శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కత్తెర పురుగు నివారణకు పిచికారీ చేయాల్సిన పురుగు మందులను రైతులకు వివరించారు. ఉదయం, సాయంత్రం మొక్కజొన్న సుడుల్లో ద్రావణం పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎంవీ.నగేశ్‌కుమార్, బి.మల్లయ్య, వాణిశ్రీ, రాజశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఏడీఏ వీణ, ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో గణేశ్ తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్ మండలంలో..

దిలావర్‌పూర్: మొక్కజొన్న, జొన్న పంటలపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్త నగేశ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పంటలను జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను, డెలిగేట్‌ను స్థానిక వ్యవసాయాధికారుల సూచనల మేరకు వినియోగించాలని సూచించారు. వారి వెంట ఏడీఏ వినయ్‌బాబు, ఏవో స్రవంతి ఏఈవోలు శ్రీవాణి, శ్రీదేవి, లక్ష్మి, రైతులు ఉన్నారు.

కనుల పండువగా అయ్యప్ప పడిపూజ



ఖానాపూర్: పడిపూజలో భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఎనగంటి అజయ్ అనే భక్తుడి నివాసంలో గురువారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పండితులు నర్ర నితీశ్, విజయ్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకంతో పాటు కర్పూర హారతులు, మెట్ల పూజ తదితర పూజాది కార్యక్రమాలను జరిపించారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో కన్నెస్వామి గురజాల ప్రసాద్ నివాసంలో గురువారం మహాపడిపూజను నిర్వహించారు.

విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి

కడెం: నియోజకవర్గంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల వేళ ప్రకటించిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

బాధితులకు పరామర్శ

కుంటాల: మండలంలోని కల్లూర్ మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ధర్మాగౌడ్, గుద్దేటి గంగాధర్ తదితరులు ఉన్నారు.

నిర్మల్ నుంచి లోకల్‌వెల్మల్‌కు బస్సు ప్రారంభం



బస్సు వద్ద గ్రామస్తులు

సోన్: మండలంలోని లోకల్‌వెల్మల్ గ్రామానికి గురువారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. నిర్మల్ నుంచి సిద్దాపూర్, కొట్ల, సిద్దులకుంట గ్రామాల మీదుగా లోకల్‌వెల్మల్ వరకు.. తిరిగి లోకల్ వెల్మల్ నుంచి నిర్మల్ వరకు బస్సును నడిపిస్తున్నట్లు సర్పంచ్ కవిత అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని బస్సు నడిపించాలని కోరగా ఆయన నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కరించారని పేర్కొన్నారు. గ్రామానికి బస్సు రావడంతో మహిళలకు ఉచిత ప్రయాణం అందుతుందని హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కడెం: మండలంలోని లింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇటీవల బదిలీపై వెళ్లిన.. బదిలీపై పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు వామన్‌రావు, కంఠేశ్వర్, మునీందర్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులను శాలువాతో సన్మానించారు. ఇందులో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ బాలవ్వ తదితరులున్నారు.

ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ముధోల్: ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపాటిల్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మండలంలోని ముద్గల్ సర్పంచ్ రామచందర్, మాజీ సర్పంచ్‌లు మాధవ్‌రావు, శ్యామ్‌రావుతో పాటు నాయకులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు. ప్రజలు సైతం సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



తీసుకున్న దుప్పట్లతో పేదలు

ఖానాపూర్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కడెం మండలం బెల్లాల్ గ్రామ క్యాథలిక్ చర్చి సహకారంతో ఫాదర్ జోషి, బ్రదర్ రాగుల రాకేశ్, సంపత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గిరిజనులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఖానాపూర్ మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని ఇప్పమాడ, తుమ్మగూడెంతోపాటు ఎర్వచింతల్, కోలాంగూడ గ్రామాల్లో 50 దుప్పట్లు పంపిణీ చేశారు. సిస్టర్లు డాలీ, డేసి తదితరులున్నారు.

'బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు'



నాయకులతో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాలేదని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని.. అధైర్యపడొద్దని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో పార్టీ కార్యకర్తలు, ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన కొట్లాడి ప్రజాసమస్యల పరిష్కారంలో కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాను నాయకుడిలా కాకుండా సేవకుడిలా వచ్చానని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన బూటకపు హామీలపై పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగంగన్న, నిమ్యానాయక్, ప్రశాంత్ రెడ్డి, మహేందర్, శ్యాం, రాజశేఖర్, నసీర్, అజయ్, షోయబ్, లింగన్న, మధు, అర్షద్, ఎర్రన్న, రమేశ్, నాగేశ్ తదితరులు ఉన్నారు.

ఓటరుజాబితా పకడ్బందీగా రూపొందించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సర్సాపూర్(జి): ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ శ్రీనివాస్ బీఎల్‌వోలకు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండేవారికి ఓటరు జాబితాలో చోటు కల్పించాలని సూచించారు. నకిలీ ఓట్లతోపాటు మృతి చెందిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. నూతన ఓటర్లు నమోదయ్యేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. డీటీ వాహిదొద్దీన్, ఆర్ఐలు వేణుగోపాల్, సుమలత, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఆపదలో 100కు సమాచారమివ్వండి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుమాంజలి

సారంగపూర్: ఆపదలో మహిళలు, యువతులు ఆందోళన చెందకుండా 100కు లేదా 8712659550 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని షీటీం ఎస్సై సుమాంజలి అన్నారు. మండలంలోని చించోలి(బి) సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారికి గురువారం షీటీం సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం కానిస్టేబుల్ రాధిక, ప్రాంగణ నిర్వాహకులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

18న దినసరి కార్మికుల సమావేశం

ఖానాపూర్: గిరిజన సంక్షేమశాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేసే పలువురు సిబ్బందికి ఈనెల 18న ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్, పీఎంఆర్సీ మీటింగ్‌హాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు దినసరి కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజలింగు, కోల వసంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా చోట్ల విధులు నిర్వహించే వాచ్‌మెన్, కామాటి, కుక్, దినసరి కార్మికులు, శానిటేషన్ కార్మికులు హాజరవాలని కోరారు. ఐటీడీఏ పీవోతోపాటు అన్ని జిల్లాల డీటీడీవోలు తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

మూడోరోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మెలో ఉద్యోగులు

భైంసా: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని భైంసా డివిజన్‌వ్యాప్తంగా గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. జీడీఎస్ ఉద్యోగులకు ఎనిమిది గంటల పనికి వేతనం, పెన్షన్ ప్రయోజనం కల్పించాలని యూనియన్ నాయకులు సీహెచ్.దేవన్న డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. గ్రామీణ డాక్‌సేవక్ ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఆలిండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ డాక్ సేవక్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. ముధోల్, బాసర ట్రిపుల్‌ఐటీ, బాసర, కుంటాల ఎస్‌వోల ముందు ఉద్యోగులు నిరసన చేపట్టారు.

'మహాలక్ష్మి'ని రద్దు చేయాలి



రహదారిపై బైఠాయించిన ఆటో డ్రైవర్లు

భైంసాటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం తమ జీవనోపాధిని దూరం చేస్తోందని.. వెంటనే దానిని రద్దు చేయాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిపోయిందని వాపోయారు. అనంతరం ఆందోళన విరమించారు.



మంచు తెరలో భానుడు..

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో గురువారం ఉదయం మంచు కమ్మేసింది. మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేదు. ఏడు గంటలకు సూర్యోదయం రాగా భానుడు మంచు తెరలు చీల్చుకుంటూ వచ్చిన దృశ్యమిది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899